

గుప్తనిధుల ముఠా అరెస్ట్

గుప్తనిధుల ముఠా సభ్యుల్ని పోలీసులు అరెస్ట్ చేసి, వారి వద్దనున్న పనిముట్లను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ దిలీప్‌కుమార్ వివరాలు వెల్లడించారు. - 8లో



ఆ మలుపు.. ప్రమాదానికి పిలుపు

బి. కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ ఘాట్‌రోడ్డుపై మృత్యు ఘంటికలు మోగుతున్నాయి. అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.- 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.270	రూ.360
రెండోరకం	రూ.160	రూ.268

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 173 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

వీరభద్రుడికి పల్లకీ సేవ

రాయచోటిటౌన్ : దీపావళి పర్వదినం సందర్భంగా ఆదివారం శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆదివారం రాత్రి స్వామి వారికి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారికి, అమ్మవారికి రంగు రంగుల పూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అందంగా అలంకరించి పల్లకీలో ఉంచి ఆలయ మాఢ వీధులలో ఊరేగించారు. ఈ పల్లకీ సేవలో ఆలయ ప్రధాన అర్చకులు, సిబ్బంది, అధికారులంతా సంప్రదాయ దుస్తులు ధరించి స్వామి పల్లకీ సేవ నిర్వహించారు. ఈ పూజల్లో ఆలయ పాలక మండలి అధ్యక్షులు పోలం రెడ్డి విజయ, ఆలయ ఈవో డివి రమణారెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహించారు.

క్రికెట్ ప్రేమికులకు 'కను'విందు

కడప స్పోర్ట్స్ : క్రికెట్ వరల్డ్ కప్–2023లో భాగంగా సెమీఫైనల్ మ్యాచ్‌లో తలపడనున్న ఇండియా–న్యూజిలాండ్ మ్యాచ్‌ను కడప ప్రజలు వీక్షించేందుకు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల (ఆర్ట్స్ కళాశాల) మైదానంలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్, క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్ఆర్ డిస్ట్రిక్ట్ ఆధ్వర్యంలో 'ఫ్యాన్స్ పార్క్' పేరుతో భారీ స్క్రీన్ ఏర్పాటు చేసి మ్యాచ్‌ను తిలకించే ఏర్పాట్లు చేస్తున్నట్లు సీఏవైడీ కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్ తెలిపారు. బుధవారం మధ్యాహ్నం 1.30 గంటల నుంచి లైవ్ మ్యాచ్‌ను ఉచితంగా వీక్షించవచ్చని తెలిపారు. క్రికెట్ అభిమానులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కబడ్డీలో వైవీయూ సత్తా

వైవీయూ : జేఎన్‌టీయూ కాకినాడలో ఈనెల 9 నుంచి 12 వరకు నిర్వహించిన దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయాల కబడ్డీ పోటీల్లో యోగివేమన విశ్వవిద్యాలయం కబడ్డీ జట్టు జయకేతనం ఎగురవేసింది. ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయాలు తలపడిన ఈ పోటీల్లో వైవీయూ పురుషుల జట్టు మూడోస్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించింది. దీంతో పాటు ఆలిండియా అంతర్ విశ్వవిద్యాలయ కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించింది. వైవీయూ వీసీ చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథ రెడ్డి, క్రీడాబోర్డు కార్యదర్శి డా. కె. రామసుబ్బారెడ్డి అభినందనలు తెలిపారు.

26న రజక ఆత్మ గౌరవ సభ

కడప సెవెన్ రోడ్స్ : రజక ఆత్మ గౌరవ సభ ఈ నెల 26 తేదీ గుంటూరులో జరుగుతుందని రజక సంఘాల ఐక్యవేదిక జిల్లా నాయకుడు అర్కటవేముల జయరాముడు తెలిపారు. సోమవారం కడప నగరంలోని ఆ సంఘ కార్యాలయంలో ఆత్మ గౌరవ సభకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు పాతపాటి అంజిబాబు పిలుపుమేరకు జరగనున్న ఈ కార్యక్రమానికి జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో రజకులు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐక్య వేదిక జిల్లా నాయకులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

కడప సెవెన్‌రోడ్స్ : దళితమిత్ర సంఘం జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక సోమవారం కడప నగరంలోని తిలక్‌నగర్‌లో జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా కె.బాబు, ఉపాధ్యక్షుడిగా పాన్నోలు బాల సుబ్బయ్య, ప్రధాన కార్యదర్శిగా మామిడి రామ సుబ్బయ్య, కోశాధికారిగా చెన్నూరు విజయ్, కార్యదర్శులుగా గోవిందు, ఉపేంద్రలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర దళితమిత్ర అధికార ప్రతినిధి పెడబల్లె నాగభూషణం, వ్యవస్థాపక అధ్యక్షులు కె.రామాంజనేయులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం ద్వారా సామాజిక న్యాయం కోసం కొత్త కార్యవర్గం కృషి చేయాలని కోరారు. దళిత మిత్ర సంఘం యువజన రాష్ట్ర అధ్యక్షులు నరహరి పాల్గొన్నారు.

అది మోదీ సభ



మాట్లాడుతున్న దండు వీరయ్య మాదిగ

ముద్దనూరు : హైదరాబాదులో జరిగిన మాదిగల విశ్వరూప సభ నరేంద్ర మోదీ సభలా వుందని ఏపీ ఎమ్మార్పీయస్ రాష్ట్ర అధ్యక్షుడు దండువీరయ్య మాదిగ విమర్శించారు. ఆదివారం ఆయన ముద్దనూరులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రెండు రాష్ట్రాలలో సుమారు ఒకటిన్నర కోటి మంది మాదిగలున్నా కేవలం లక్ష మంది హాజరయ్యారని, అది కేవలం బీజేపీ విశ్వరూప మహాసభ అని ఆయన విమర్శించారు. ఒక రాజకీయపార్టీకి మన కులాన్ని తాకట్టుపెట్టినట్టుందని, ఢిల్లీలో బిల్లు పెట్టాల్సిన ప్రధాన మంత్రి హైదరాబాదుకు వచ్చి మీలో ఒకడిని అని చెప్పడం విడ్డూరమని ఆయన విమర్శించారు. ఎమ్మార్పీయస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్లయ్య మాదిగ పాల్గొన్నారు.



కార్తీకం.. పవిత్రం

• కార్తీక దీపాలు...వెలిగాయి

సోమవారం మధ్యాహ్నం నుంచి కార్తీక మాసం ప్రారంభం కావడంతో సాయంత్రం శివాలయాల్లో భక్తులు కార్తీక దీపాలను వెలిగించారు. నెల రోజులపాటు జరగనున్న ఈ ఉత్సవాలలో భాగంగా తొలిరోజు కార్తీక మాసం తొలి సోమవారాన్ని పురస్కరించుకుని ఆలయాలు ధ్వజస్తంభాల వద్ద ఆకాశదీపాలు వెలిగించారు. కడప మృత్యుంజయకుంట శివాలయంలో ఈఓ ఎ.శ్రీధర్ ఆధ్వర్యంలో అర్చకులు శశిధర్ పూజాధికాలు నిర్వహించి శాస్త్రోక్తంగా ఆకాశదీపం వెలిగించారు. మాసం ప్రారంభం సందర్భంగా తొలి దీపం వెలిగిస్తే మంచిదన్న భావనతో కొందరు భక్తులు కూడా కుటుంబాలతో కలిసి వచ్చి ఆలయ ఆవరణలో దీపాలను వెలిగించారు.



కడపలో కార్తీక దీపాలను వెలిగిస్తున్న భక్తులు

- మాసమంతా విశేష పూజలు
- సిద్ధమవుతున్న శివాలయాలు
- పౌర్ణమినాడు శివ కల్యాణాలు, కార్తీక దీపోత్సవం
- అటవీప్రాంత ఆలయాలపై ప్రత్యేక దృష్టి

రాజంపేటటౌన్/మదనపల్లెసిటీ: కార్తీకమాసం ప్రారంభమైంది. ఏటా దీపావళి అమావాస్య ముగియగానే పాడ్యమి నుంచి కార్తీకం మొదలవుతుంది. ఈ ఏడాది దేవదాయశాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర మంతటా ఘనంగా కార్తీక ఉత్సవాలను నిర్వహించేందుకు అధికారులు విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

దేవదాయశాఖ ఆధ్వర్యంలో కార్తీక ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శంకర్ బాలాజీ ఆధ్వర్యంలో కసరత్తు ప్రారంభమైంది. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని రైల్వేకోడూరు లోగల శ్రీ భుజంగేశ్వరస్వామి ఆలయం, అత్తిరాల పరుశురామాలయం, సిద్దవటం మండలంలోని నిత్యపూజకోన, ఒంటిమిట్టలోని ముకుంద మల్లేశ్వరస్వామి, పొలతల శ్రీ మల్లికార్జునస్వామి, కడప నగరంలోని శ్రీ మృత్యుంజయేశ్వరస్వామి, దేవునికడప శ్రీ సోమేశ్వరస్వామి ఆలయం, అల్లాడుపల్లె, రాయచోటిలలోని వీరభద్రస్వామి ఆలయాలు, ప్రొద్దుటూరు శ్రీ అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో కార్తీక ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రతిరోజూ..

కార్తీక మాసోత్సవాలలో భాగంగా ప్రతిరోజు ఉదయం అభిషేకాలు, అలంకారాలు, విశేష పూజలు, సర్వదర్శనం నిర్వహిస్తారు. ప్రత్యేకించి నాలుగు సోమవారాల్లో ఆలయాలు భక్తులతో కళకళలాడనున్నాయి. ఈ సంవత్సరం కార్తీక పౌర్ణమి సందర్భంగా ఉదయం లేదా మధ్యాహ్నం ఆయా ఆలయాలలో శివ కల్యాణాలు నిర్వహించి రాత్రి జ్వాలా తోరణం కార్యక్రమాలు చేపట్టనున్నారు.

విస్తృత ఏర్పాట్లు

జనావాసాల మధ్యన ఉన్న దేవాలయాల్లోనే కాకుండా ముఖ్యంగా అటవీ ప్రాంతాల్లోని శివాలయాల్లో ఉత్సవాల నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. రోడ్ల అభివృద్ధి, బారికేడ్ల ఏర్పాట్లు, క్యూలైన్ల నిర్వహణ, లైటింగ్‌లపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. విద్యుత్ సరఫరాలో లోపాలను దృష్టిలో పెట్టుకుని జనరేటర్లను కూడా సిద్ధంగా ఉంచుతున్నారు. అన్నదానాలు నిర్వహించనున్నారు.

సజావుగా దర్శనాలు

అవసరమైన మేరకు ప్రొటోకాల్ పాటించినా దర్శనాలలో సాధారణ భక్తులకే తొలి ప్రాధాన్యత ఇవ్వనున్నామని దేవదాయశాఖ అధికారులు పేర్కొన్నారు. ఇందుకోసం ఆయా ఆలయాల ఈఓలు, ఇన్‌స్పెక్టర్లను పర్యవేక్షణ కోసం ఏర్పాటు చేశామన్నారు. పరిస్థితిని బట్టి వారు పోలీసు బందోబస్తును కోరవచ్చన్నారు. ఆలయాల వద్ద తాత్కాలిక వైద్య సదుపాయాలు కల్పించేందుకు వారు కృషి చేస్తారని,అవసరమైనచోట ముందుజాగ్రత్తగా ఫైరింజన్ సహకారం కూడా తీసుకోవాలని సూచించామన్నారు. మండల స్థాయిలో ఈఓలు, ఇతర ఎండో అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి సూచనలు ఇవ్వనున్నట్లు తెలిపారు.

పారిశుధ్య చర్యలు

ఆలయాల వద్ద పారిశుధ్యానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వనున్నామని, భక్తులు కూడా ఈ విషయంగా తమకు సహకరించాలని దేవదాయశాఖ అధికారులు కోరుతున్నారు. పొలతల, అల్లాడుపల్లె, నిత్యపూజకోనలోని కోనేర్లను శుభ్రం చేయాలని ఆదేశించామన్నారు. ముఖ్యంగా భక్తులు కోనేటిలోనూ, ఆ బయట ప్లాస్టిక్ కాగితాలు, వ్యర్థాలు వేయవద్దని సూచించారు. నదీ తీరాలు, అటవీ ప్రాంతాల ఆలయాలకు వెళ్లే సమయంలో కుంటలు, వాగుల్లో ఈతకొట్టడం మంచిది కాదని, పిల్లలు, యువకులను ఈ విషయంలో జాగ్రత్తగా ఉండేలా పెద్దలు శ్రద్ధ చూపాలని కోరుతున్నారు.

ముక్తికి మార్గం కార్తీకమాసం



హరిహరులకు అత్యంత ప్రీతిపాత్రమైన మాసం కార్తీకం. ముఖ్యంగా కైలాస నివాసుడైన ఆ పరమేశ్వరున్ని ఈ మాసంలో భక్తిశ్రద్ధలతో స్వచ్ఛంగా రుద్రాభిషేకాలు, రుద్రపూజలతో పాటు బిల్వార్చన చేస్తే ఎంతో శుభప్రదం. విష్ణుమూర్తిని తులసిదళాలతో పూజిస్తే ఆయన అనుగ్రహం కలుగుతుంది. ముక్తికి మార్గం కార్తీకమాసమని చెప్పవచ్చు. – సాయిచక్రవర్తి, వేదపండితులు, మదనపల్లె

పూర్తయిన ఏర్పాట్లు



కార్తీకమాసంలో శివాలయాలకు భక్తులు వేల సంఖ్యలో తరలివస్తారు. అందువల్ల దేవదాయశాఖ పరిధిలో ఉన్న అన్ని శివాలయాల్లో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశాం. అందువల్ల భక్తులు ప్రశాంతంగా శివాలయాలకు వచ్చి పూజలు నిర్వహించుకోవచ్చు. – విశ్వనాథ్, జిల్లా దేవదాయశాఖ అధికారి, అన్నమయ్యజిల్లా

వెలుగు జిలుగులు

వైభవంగా దీపావళి

కడప కల్చరల్ : దీపావళి పర్వదినాన్ని ప్రజలు ఆదివారం వైభవంగా నిర్వహించుకున్నారు. సాయంత్రం 6.00 గంటలకే వీధులన్నీ లక్ష్మీ పటాసుల ధ్వనులతో మార్మోగాయి. పిల్లల అల్లరిని సూచిస్తూ తారాజువ్వలు రివ్వుమని ఆకాశానికి ఎగిరాయి. పెద్దల ఆనందానికి ఉదాహరణగా మతాబులు, చిచ్చుబుడ్లు, వెలుగులు చిమ్మాయి. పెద్దల ఆధ్వర్యంలో పిల్లలు కట్టలు తెగిన సంతోషంతో ఉత్సాహం ఉరకలేస్తుండగా టపాసులు కాల్చారు. ఉత్సాహం ఎక్కువైన పిల్లలు, యువకులు రోడ్లపైనే తారాజువ్వలు, లక్ష్మీబాంబులు పేలుస్తుండడంతో వాహనదారులు ఒకింత అసౌకర్యానికి గురయ్యారు. అయినా పిల్లల నుంచి వృద్ధుల వరకు టపాసులు కాల్చుస్తూ ఉత్సాహంగా గడిపారు. పిల్లలు పట్టుబట్టడంతో మతబేధాలు లేకుండా అందరూ టపాసులు కాల్చుకున్నారు. హిందువుల ఇళ్ల ముందు రంగురంగుల ముగ్గులు వేసి దీపాలు తీర్చారు. కాంపౌండ్ గోడలపై దీపాల వరుసలు కనుల పండుగ చేశాయి.



పులివెందులలో బాణసంచా వెలుగులు

డిసెంబర్‌లో రచయితల సంఘం మహాసభలు

కడప కల్చరల్ : వైఎస్సార్‌జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో డిసెంబరు 23, 24 తేదీల్లో మహాసభలు నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక సీపీ బ్రౌన్‌భాషా పరిశోధన కేంద్రంలో సంఘం సభ్యులతో కలిసి ఆయన సంస్థ లోగోను ఆవిష్కరించారు. వైఎస్సార్ జిల్లా చరిత్ర, సంస్కృతి, సాహిత్యాల విశిష్టతను దశదిశలా చాటేలా ఈ మహాసభలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రాచీన సాహిత్యం నుంచి ఆధునిక సాహిత్యం వరకు పలు ప్రక్రియల్లోని అంశాలపై, జిల్లా చరిత్ర, సంస్కృతి, పర్యాటకం, పత్రికా రంగాల సంబంధించి సదస్సుతోపాటు అవధానులతో స్వీయపరిచయం, కవిసమ్మేళనం, హాస్యావధానం తదితర అంశాలను నిర్వహిస్తామన్నారు. ఆయా రంగాల్లో ప్రముఖులైన వారిని ముఖ్య అతిథులుగా, వక్తలుగా ఆహ్వానిస్తామని, ఈ సందర్భంగా మహాసభల ప్రత్యేక సంచికను కూడా వెలువరించనున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లోగో చిత్రకారుడు సీహెచ్.వెంకటేశ్, గౌరవాధ్యక్షులు షేక్ హుస్సేన్ సత్యాగ్ని, ఉపాధ్యక్షులు గానుగపెంట హనుమంతరావు, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, కార్యదర్శులు జింకా సుబ్రహ్మణ్యం, డాక్టర్‌భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, సంయుక్త కార్యదర్శులు భూమిరెడ్డి స్వరూపరాణి, షేక్ షబ్బీర్, కోశాధికారి డాక్టర్ కొప్పోలు రెడ్డి శేఖర్ రెడ్డి, సభ్యులు డాక్టర్లు జి.వి.సాయిప్రసాద్, డాక్టర్ పెద్దిరెడ్డి నీలవేణి, డాక్టర్ పాలెం వేణుగోపాల్, డాక్టర్ వెల్లాల వేంకటేశ్వరాచారి, డాక్టర్ ఎస్.రాజగోపాలరెడ్డి పాల్గొన్నారు.



మహాసభల లోగోలను ఆవిష్కరిస్తున్న సంఘం ప్రతినిధులు

లక్ష్మీ వేంకటేశ్వరుడు

పోరుమామిళ్ల శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో దీపావళి సందర్భంగా ఆదివారం రాత్రి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శ్రీ ధనలక్ష్మీపూజ నిర్వహించారు. స్వామిని 20, 50 రూపాయల నోట్లను పూలదండలుగా తయారు చేసి శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామిని, మండపాన్ని, దివ్యంగా అలంకరించారు. ఆశ్వయుజ అమావాస్య రోజు నిర్వహించే ఈ పూజ వల్ల శ్రీ మహాలక్ష్మీ అనుగ్రహం లభిస్తుందని అర్చకులు తెలిపారు. – పోరుమామిళ్ల



మార్గం.. సుగమం!

ఒకట్రెండు కాదు వందేళ్ల సమస్యకు ఓ పరిష్కారం దొరికింది. సుమారు 25 గ్రామాల ప్రజల రాకపోకలకు 'మార్గం' సుగమమైంది. వైఎస్సార్ సీపీ ఎంపీ మిథున్ రెడ్డి కృషితో సమస్య పరిష్కారమైనందుకు ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఏమిటా దారి సమస్య.. ఇప్పుడెలా పరిష్కారమైంది.. తెలియాలంటే చదవాల్సిందే.


రాజంపేట : ముంబాయి–చెన్నై కారిడార్ రైలుమార్గంలోని రైల్వేకోడూరు ఆర్‌యూబీ నిర్మాణానికి మోక్షం లభించింది. వేలాది గ్రామీణులు, విద్యార్థుల దారి సమస్య పరిష్కారపట్టాలెక్కింది. 1857 ప్రాంతం నుంచి ఇక్కడ సింగల్‌లైన్ ఉండేది. ఆ సమయంలో ఒక (మీటర్‌గేజ్) రైలుమార్గం ఉన్నందువల్ల స్థానికులు కొంతమేర సులభంగా దాటుకుంటూ రాకపోకలు సాగించేవారు. కాలక్రమంలో మీటర్ గేజ్ లైన్ కాస్త బ్రాడ్‌గేజ్‌గా మారిపోయింది. పైగా స్టేషన్ విస్తరణలో భాగంగా యార్డులైన్లుతో పాటు లూప్‌లైన్లు నిర్మితం చేయడంతో ప్రజలకు రాకపోకలు ఇబ్బందులుగా మారాయి.

నిరసనలు..ఆందోళనలు

1948 ప్రాంతంలో రైల్వేస్టేషన్‌కు ఆవలివైపున హైస్కూలు ఏర్పాటైంది. దశలవారీగా ఆ ప్రాంతంలో వివిధ విద్యాసంస్థలు వెలిశాయి. ఈ క్రమంలో గంటల తరబడి గూడ్స్‌రైళ్లు నిలబడటంతో విద్యార్థులు వాటి కింద దూరి పోయేవారు. ఈ పరిస్థితుల్లో రైలు కదలడం అనేక మంది మృత్యువాతకు గురైన సంఘటనలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో వివిధ సంఘాలు నిరసనలు, ఆందోళనలు చేసి చేసి అలసిపోయారు.

ఆర్‌యూబీకి మోక్షం రావడంతో..

కోడూరు ఆర్‌యూబీ (రైల్వే అండర్ బ్రిడ్జి) విషయమై రాజంపేట లోక్‌సభ సభ్యుడు మిథున్‌రెడ్డి రైల్వేబోర్డు, రైల్వేమంత్రిత్వశాఖలతో నిరంతర సంప్రదింపులు, వినతులు ఇచ్చారు. ఆయన కృషి ఫలితంగా ఎట్టకేలకు ఆర్‌యూబీ మంజూరైంది. దాదాపు రూ.10కోట్లకు పైగా వ్యయంతో ఆర్‌యూబీ నిర్మాణ పనులను ఇటీవల ఎమ్మెల్యే కొరముట్లతో కలిసి ఎంపీ ప్రారంభించారు. ఇక ఎంచక్కా రాకపోకలు సాగించవచ్చని కోడూరువాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఆర్‌యూబి (మాడల్)



మార్గం	: ముంబై-చెన్నై
స్టేషన్	: రైల్వేకోడూరు
రాకపోకల జనాభా	: ప్రత్యక్షంగా 20వేలు.. పరోక్షంగా మరో 10వేల మంది
సమస్య నుంచి విముక్తి	: 25 గ్రామాలకు

చాలా సంతోషంగా ఉంది..



కోడూరు స్టేషన్ ఆవలివైపు ఉన్న హైస్కూల్‌లో 1975లో క్లర్క్‌గా చేరాను. అప్పటి నుంచి రిటైర్డ్ అయ్యే వరకు అదే హైస్కూల్‌లో పనిచేస్తూ వచ్చాను. నిత్యం రైలుపట్టాలు దాటి హైస్కూల్‌కు వెళ్లాల్సి వచ్చేది. ఎంపీ కృషి వల్ల ఆర్‌యూబీ మంజూరైంది. – గంగయ్య, చిట్వేలి

కష్టాలు తీరనున్నాయి



రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి కృషి ఫలితంగా వేలాదిమంది రాకపోకలకు కష్టాలు తీరాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఎంపీ కృషితో ఆర్‌యూబీ నిర్మాణం జరుగుతోంది. ప్రజల రాకపోకలకు మార్గం సుగమం కానుంది. – కొరముట్ల శ్రీనివాసులు, ఎమ్మెల్యే, కోడూరు

చిరకాలస్వప్నం నెరవేరింది



రైలుపట్టాలపై దాటే అవసరం లేకుండా ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసుల కృషితో రోడ్ అండ్ బ్రిడ్జి నిర్మాణం జరుగుతోంది. ఆర్‌యూబీ వల్ల వేలాది మంది విద్యార్థులు, గ్రామీణులు లబ్ధిపొందనున్నారు. – తల్లెంభరత్ కుమార్‌రెడ్డి, డీఆర్‌యుసీసీ సభ్యుడు, కోడూరు

నాణ్యమైన విద్యే లక్ష్యం



ప్రీ స్కూలు యాక్టివిటీపై శిక్షణ ఇస్తున్న కార్యకర్త

- అంగన్వాడీ కేంద్రాల్లో ఉత్తమ బోధనకు ప్రభుత్వ చర్యలు
- ప్రీ స్కూలు యాక్టివిటీపై సీడీపీఓలు, సూపర్‌వైజర్లకు శిక్షణ
- వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలకు కలిపి కార్యక్రమం

కడప కోటిరెడ్డిసర్కిల్ : అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోంది. పిల్లలకు మంచి విద్యను అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకుసాగుతున్నారు. ఇందులో భాగంగా అంగన్వాడీ కేంద్రాల పనితీరును పర్యవేక్షించే సీడీపీఓలు, సూపర్‌వైజర్లకు పిల్లలకు ఇచ్చే విద్యాబోధనలో నాణ్యత, మెలకువలపై శిక్షణ ఇస్తున్నారు. అందుకోసం పూర్వ ప్రాథమిక విద్యాబోధనపై శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటికే శిక్షణ పూర్తి చేశారు. శిక్షణ పూర్తి చేసుకున్న తమ పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు.

ఆరు రోజులపాటు శిక్షణ

వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో పనిచేస్తున్న ఐసీడీఎస్ సీడీపీఓలు, సూపర్‌వైజర్లకు కడప నగరంలోని గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాలలో శిక్షణ ఇస్తున్నారు. ఒక్కో బ్యాచ్‌లో 50–60 మంది చొప్పున ఒక్కో బ్యాచ్‌కు ఆరు రోజులపాటు శిక్షణ ఇచ్చారు. ఇప్పటికే మూడు బ్యాచ్‌లు చొప్పున శనివారంతో శిక్షణ పూర్తయింది.

జిల్లాలో 13 ఐసీడీఎస్ ప్రాజెక్టులు

వైఎస్సార్ జిల్లాలో కడప అర్బన్, చింతకొమ్మదిన్నె, కమలాపురం, వేంపల్లె, ముద్దనూరు, పులివెందుల, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు అర్బన్, ప్రొద్దుటూరు రూరల్, మైదుకూరు, చాపాడు, బద్వేలు, పోరుమామిళ్ల ప్రాజెక్టులు ఉన్నాయి. వీటి పరిధిలో 2389 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి పర్యవేక్షణకు 11 మంది ఐసీడీఎస్ సీపీడీఓలు, 92 మంది సూపర్‌వైజర్లు ఉన్నారు. వీరి పరిధిలో 14,888 మంది గర్భిణులు, 14,239మంది బాలింతలు, 7 నెలల నుంచి మూడేళ్ల వరకు 73,804 మంది చిన్నారులు, 3–6 సంవత్సరాల మధ్య 42,233 మంది పిల్లలు ఉన్నారు.

కాన్వెంట్లకు దీటుగా విద్యాబోధన

ప్రైవేటు కాన్వెంట్ల కన్నా ధీటుగా అంగన్వాడీ కేంద్రాల్లో బోధన ఉండేలా ప్రీ స్కూలు యాక్టివిటీ (పూర్వ ప్రాథమిక విద్య)పై శిక్షణ ఇస్తున్నా రు. ఇంకా ఎక్కువ మంది పిల్లలు కేంద్రాలకు వచ్చేలా శిక్షణా విధానం ఉండగా, ప్రీ స్కూలు కిట్లను కూడా ప్రభుత్వం అందించనుంది.



చిన్నారులకు విద్యాబోధన చేస్తున్న అంగన్వాడీ కార్యకర్త

అంగన్వాడీ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో నాణ్యమైన బోధనను అందించేందుకు ప్రభుత్వం సీడీపీఓలు, సూపర్‌వైజర్లకు శిక్షణను ఇస్తోంది. ఈ శిక్షణ ద్వారా అంగన్వాడీ కేంద్రాలను బలోపేతం చేసేందుకు కార్యకర్తలు అందించే శిక్షణ ద్వారా చిన్నారులకు మంచి బోధన అందించేందుకు ప్రతి ఒక్కరూ కార్యకర్తలు శిక్షణను సద్వినియో గం చేసుకోవాలి. – వసంతబాయి, సీడీపీఓ

శిక్షణతో ఉత్తమ ఫలితాలు



అంగన్వాడీ కేంద్రాల్లోని పిల్లలకు నాణ్యమైన బోధనను అందించేలా సీఎం వైఎస్ జగన్ అనేక చర్యలు తీసుకుంటున్నారు. ఐసీడీఎస్‌లోని సీడీపీఓలు, సూపర్‌వైజర్లకు శిక్షణ ఇస్తున్నాం. శిక్షణ పూర్తి చేసిన తర్వాత అంగన్వాడీ కేంద్రాల్లో పనిచేసే కార్యకర్తలకు శిక్షణ ఇస్తారు. దీంతో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చు.– శ్రీలక్ష్మి, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ సాధికారత అధికారి, కడప

ఆ మలుపు.. ప్రమాదానికి పిలుపు

- ప్రమాదకరంగా హార్సిలీహిల్స్ ఘాట్‌రోడ్డు
- పైప్‌లైన్ వద్ద అదుపు తప్పితే అంతే
- మృత్యుపాలవుతున్న వాహనదారులు

బి.కొత్తకోట : మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ ఘాట్‌రోడ్డుపై మృత్యు ఘంటికలు మోగుతున్నాయి. కాండ్లమడుగు నుంచి కొండపైకి చేరుకోవాలంటే 9 కిలోమీటర్ల ఘాట్‌రోడ్డులో ప్రయాణించాలి. ఈ రోడ్డు మొత్తం ప్రమాదాలతో కూడుకొన్నదే. అందులో ప్రొద్దుటూరు మలుపు, రేణిమాను మలుపులు ప్రమాదకమైనవి. అన్నింటికి మించి పైప్‌లైన్ వద్ద ఉన్న సన్నని ఈ మలుపులో.. కొండపై నుంచి కిందకు వచ్చేటప్పుడు కుడివైపున రోడ్డుపై ఉన్న నీలగిరి వృక్షం ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ చెట్టును ఢీకొని ఎందరో ప్రాణాలు కోల్పోగా.. తీవ్రంగా గాయపడిన వారి సంఖ్య ఎక్కువే. సోమవారం మదనపల్లెకు చెందిన నవజీవన్ (16) బైక్‌పై వెళ్తుండగా, ఈ చెట్టునే ఢీకొని మృతి చెందాడు.

భయం.. భయం

ఘాట్‌రోడ్డులో పైప్‌లైన్ మలుపు అంటే పర్యాటకులు హడలిపోతున్నారు. కొండపైకి వెళ్లే సందర్శకులు ఈ చోట ఎలాంటి ప్రమాదాలకు గురైన దాఖలాలు లేవు. కొండపైనుంచి కిందకు దిగేటప్పుడే ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇక్కడ కొద్దిపాటి మలుపు వుంది. పైనుంచి వేగంగా లేదా నిర్లక్ష్యంగా వాహనాలు నడిపే వారు ఈ చోటకు రాగానే అదుపు చేయలేకపోతుంటారు. ఎడమవైపున వాహనాలను అదుపు చేసే పరిస్థితి లేదు. ఎందుకంటే ఎడమవైపు రక్షణగోడ ఉంది. దాన్ని ఢీకొంటే వాహనాలు లోయలోకి పడ్తాయని, కుడివైపు వాహనాలను మళ్లీంచే ప్రయత్నం చేస్తారు. సరిగ్గా ఇక్కడే రోడ్డుపక్కనే ఉన్న నీలగిరి వృక్షాన్ని ఢీకొనడం జరుగుతోంది. ద్విచక్ర వాహనదారులైతే తీవ్రగాయాలతో లేదా ప్రాణాపాయానికి గురవుతారు. కార్లు అయినా అందులోని సందర్శకులు గాయపడటం, వాహనాలు ధ్వంసం అవుతుంటాయి. 2020 మార్చి 5న తంబళ్లపల్లె మండలం కురవపల్లెకు చెందిన జి.సాయిఉత్తేజ్ (21), నంద్యాల జిల్లా బేతంచెర్లకు చెందిన ఎస్.తివిక్రమ్ (21), పులివెందులకు చెందిన హబీబుల్లాలు కురబలకోట అంగళ్లులో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నారు. మిత్రులైన వీరు ద్విచక్ర వాహనాల్లో కొండకు వచ్చారు. కొండపై విడిది చేసిన వీరిలో ఉత్తేజ్, తివిక్రమ్ ద్విచక్ర వాహనంలో తెల్లవారుజాము 5 గంటల సమయంలో కొండ దిగుతూ ఘాట్‌రోడ్డు పైప్‌లైన్ వద్దనున్న మలుపు వద్దకు రాగానే.. వాహనం అదుపుతప్పి నీలగిరి వృక్షాన్ని ఢీకొంది. ఈ సంఘటనలో సాయిఉత్తేజ్ ఘటనా స్థలంలో దుర్మరణం చెందాడు. అదే చోట ఇప్పుడు సోమవారం నవజీవన్ చనిపోయాడు. ఎంతో భవిష్యత్తు కలిగిన విద్యార్థులు ఇక్కడ ప్రమాదాలకు గురై మృత్యువాత పడుతున్నారు. ఈ చెట్టును ఢీకొన్న బైక్‌లు, కార్ల సంఖ్యగా ఎక్కువే కాబట్టి అధికారులు సత్వరమే స్పందించి ప్రమాదాలు జరగకుండా కఠిన చర్యలు చేపట్టాల్సి ఉంది.


చెట్టును ఢీకొ కారు (ఫైల్)


హార్సిలీహిల్స్ ఘాట్‌రోడ్డుపై పైప్‌లైన్ వద్దనున్న మలుపు

చర్యలు చేపట్టాలి

ఘాట్‌రోడ్డుకు ఇరువైపులా వందేళ్లకు పైగా ఉన్న మహా నీలగిరి వృక్షాలు ఆకాశాన్నంటేలా కనిపిస్తాయి. వీటివల్ల ఇబ్బందులు లేకపోయినా అదుపు తప్పి ప్రమాదాలకు గురయ్యే ద్విచక్ర వాహనాలు, కార్లు వృక్షాలను ఢీకొనాల్సిందే. లేదంటే కొండను ఢీకొనాలి. ఈ పరిస్థితుల నుంచి సందర్శకులు జాగ్రత్తపడేలా రెవెన్యూ, రవాణా, రహదారి భవనాలు, పోలీసు శాఖల అధికారులు చర్యలు చేపట్టాల్సివుంది. హెచ్చరిక సూచనలు తెలిపే బోర్డులతోపాటు రోడ్డుపై వేగ నియంత్రణ సూచించే గుర్తులు వేయించాల్సిన అవసరం ఉంది. వీటితో సందర్శకులు అప్రమత్తమై ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్త పడే అవకాశాలుంటాయి. ఈ విషయంలో అధికారులు తక్షణమే స్పందించాల్సిన అవసరం ఉంది.

వేగమూ కారణమే

పైప్‌లైన్ సమీపంలోని మలుపు వద్ద నీలగిరి వృక్షాన్ని ఢీకొని మృతి చెందుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. దీనికి వాహనాల వేగం కూడా ఒక కారణం. పైనుంచి కిందకు దిగేటప్పుడు వాహనాలు, బైక్‌లు నడిపేవారు వేగంగా వస్తే ఈ ప్రాంతంలో అదుపుతప్పే అవకాశాలు అధికం. ఈ మలుపు ఎలా ఉంటుందో.. దగ్గరకు వచ్చాక కాని అర్థం కాదు. వేగంగా వచ్చాక వాహనాలను ప్రమాదానికి గురికాకుండా అదుపుచేసే ప్రయత్నాలు దాదాపు ఫలించవు. దీనితో బైక్‌లు, కార్లు అదుపుతప్పి నీలగిరి వృక్షాన్ని ఢీకొనాల్సిందే. ఈ ప్రమాదాల బారి నుంచి తప్పించుకోవాలంటే కిందకు దిగేటప్పుడు వేగ నియంత్రణ పాటించాలి. తద్వారా సుఖయమైన ప్రయాణం సాధ్యమవుతుంది.

మంచులో ఫొటోలు దిగేందుకు వచ్చి మృత్యువాత

- హార్సిలీహిల్స్ ఘాట్‌రోడ్డుపై చెట్టును ఢీకొన్న బైక్
- మదనపల్లె మున్సిపల్ మాజీ చైర్మన్ కుమారుడు దుర్మరణం


మృతి చెందిన నవజీవన్


విలపిస్తున్న శివప్రసాద్

బి.కొత్తకోట : మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై మంచులో ఫొటోలు దిగేందుకు మిత్రులతో కలిసి వచ్చిన ఓ యువకుడు.. తిరుగు ప్రయాణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. మరొకరు స్వల్పగాయాలతో బయటపడ్డాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మదనపల్లె మున్సిపల్ మాజీ చైర్మన్, పట్టణంలోని తూర్పు కొత్తపేటకు చెందిన శివప్రసాద్ కుమారుడు కె.నవజీవన్ (16) ఇంటర్ రెండో సంవత్సరం చదువుతుండే వాడు. హార్సిలీహిల్స్‌పై కొన్ని రోజులుగా మంచు కురుస్తోంది. ఈ మంచులో మిత్రులతో కలిసి ఫొటోలు తీసుకునేందుకు ఉదయం రెండు బైక్‌లలో నలుగురు మదనపల్లె నుంచి హార్సిలీహిల్స్‌కు వచ్చారు. తిరిగి ఉదయం 9 గంటల సమయంలో కొండపై నుంచి వెనుదిరిగారు. ఒక బైక్‌లో ఇద్దరు, ఇంకో బైక్‌లో నవజీవన్, మిత్రుడు సాయి దీపేష్ బయలుదేరారు. నవజీవన్ వస్తున్న బైక్ గంగోత్రి దాటిన తర్వాత పల్లంగా చిన్నపాటి మలుపు కలిగిన చోట అదుపుతప్పింది. కుడివైపున దూసుకెళ్లిన బైక్ రోడ్డుపైనే ఉన్న నీలగిరి వృక్షాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నవజీవన్ ఘటనాస్థలంలోనే మృతి చెందాడు. నవజీవన్‌ను కాపాడుకునేందుకు 108కు సమాచారం ఇవ్వగా.. సిబ్బంది ఉమశ్రీ, రాజు ప్రమాదస్థలికి చేరుకుని బాధితున్ని పరిశీలించగా కొనఊపిరితో ఉన్నట్టు గుర్తించి వైద్యసేవలు అందించారు. బాధితున్ని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా.. మార్గంమధ్యలో మృతి చెందాడు. ఈ బైక్‌పై ఉన్న మిత్రుడు సాయి దీపేష్‌కు ఎలాంటి గాయాలు కాకుండా ప్రాణాలతో బయటపడ్డాడు. మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు, తోటి విద్యార్థులు, బంధువులు పెద్ద ఎత్తున చేరుకోవడంతో ఆస్పత్రి నిండిపోయింది. మున్సిపల్ మాజీ చైర్మన్ శివప్రసాద్ బోరున విలపించారు. ఉదయం కళ్లముందు కనిపించిన బిడ్డ కడతేరిపోవడంతో జీర్ణించుకోలేకపోతున్నారు. కుటుంబీకులు గుండెలవిసేలా రోదించారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యేలు దొమ్మలపాటి రమేష్, షాజహాన్‌బాషా, దేశాయ్ తిప్పారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బి.నరేష్‌కుమార్‌రెడ్డిలు శివప్రసాద్‌ను పరామర్శించారు.

ఇష్టపడి కొన్న బైక్

నవజీవన్ ఎఫ్‌జెడ్ రెడ్ కలర్ బైక్‌ను ఇష్టపడి కొన్నాడు. సెల్ఫీ ఫొటోలు తీసుకునే సరదా ఉన్న ఆ యువకుడు ఆదివారం ఇంట్లో కుటుంబీకులతో కలిసి దీపావళి జరుపుకున్నాడు. రాతంత్రా టపాకాయలు కాల్చడంతో పడుకుని విశ్రాంతి తీసుకోమ్మని తల్లి చెప్పింది. సోమవారం ఉదయాన్నే ఇంటి నుంచి బయలుదేరి వెళ్లి మిత్రులతో కలిసి హార్సిలీహిల్స్ వచ్చాడు. అక్కడ సరదాగా గడిపి ఇంటికి వెళ్లేందుకు తిరుగుప్రయాణమై వస్తుండగా ఘాట్‌రోడ్డులో ప్రమాదం జరిగి మృత్యువాత పడ్డాడు. ఇంటి నుంచి వెళ్లిన బిడ్డ ఆస్పత్రిలో విగతజీవిగా పడి ఉండటం చూసి తల్లి తట్టుకోలేకపోయింది.

గుప్తనిధుల ముఠా అరెస్ట్


ముఠా సభ్యుల అరెస్ట్ చూపుతున్న ఎస్ఐ, పోలీసులు

గుర్రంకొండ : గుప్తనిధుల ముఠా సభ్యుల్ని పోలీసులు అరెస్ట్ చేసి, వారి వద్దనున్న పనిముట్లను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ దిలీప్‌కుమార్ వివరాలు వెల్లడించారు. మండలంలోని ఎల్లుట్ల గ్రామం ఇ.పసలవాండ్లపల్లెకు చెందిన మాలేటి శ్రీనివాసులు(44) కొన్ని రోజుల నుంచి జీవనాధారం నిమిత్తం మదనపల్లెలో నివాసముంటున్నాడు. అక్కడే ఇంటి నిర్మాణ పనుల్లో బేల్దారీగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతను మదనపల్లెకు చెందిన రచ్చా రవివర్మ(54)తో తమ ప్రాంతంలోని పురాతన ఆలయాలు, కొండల్లో గుప్తనిధుల ఉన్నాయని తెలియజేశాడు. ముఖ్యంగా ఎల్లుట్ల–నగరి పరిధిలో ఉన్న మూలలమ్మకొండల్లో పురాతన ఆలయాల దగ్గర గుప్తనిధులు ఉంటాయని, వాటిని తవ్వితీస్తే ఎంతో విలువైన సంపద బయటపడుతుందన్నారు. వీరిద్దరూ కలసి శ్రీసత్యసాయి జిల్లా తనకల్లుకు చెందిన సింకి భాస్కర్(43), కర్ణాటక రాష్ట్రం శ్రీనివాసపురానికి చెందిన మూరెళ్ల నాగరాజ(56), మదనపల్లెకు చెందిన అంబటి రెడ్డిసునీల్(39), వాల్మీకిపురానికి చెందిన ఇడగొట్టి రెడ్డెప్ప(39), బి.కొత్తకోటకు చెందిన వెన్నముద్దల మహేంద్ర(39)లతో ఒక ముఠాగా ఏర్పడ్డారు. ఈ నెల 10వ తేదీన అందరూ కలసి నగరి సమీపంలోని మూలాలమ్మకొండపైకి చేరుకొన్నారు. రాత్రిళ్లు అక్కడే మకాం వేసి ఏవేవో పూజలు నిర్వహించి ఆలయ పరిసరాల్లో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపారు. ఈ నెల 12న కొండపై నుంచి దిగి వస్తుండగా.. గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. వారిని అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేశారు. తవ్వకాలకు వినియోగించిన పనిముట్లను వారి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నారు. వీరిని వాల్మీకిపురం కోర్టులో హాజరు పరిచామని ఎస్ఐ తెలిపారు.

టపాసులు పేలి వ్యక్తికి గాయాలు

మదనపల్లె : టపాసులు కాలుస్తూ ఓ వ్యక్తి గాయపడిన సంఘటన ఆదివారం రాత్రి మదనపల్లె పట్టణంలో జరిగింది. నీరుగట్టువారిపల్లె చౌడేశ్వరినగర్ నాలుగో వీధికి చెందిన కుమార్(30) కుటుంబ సభ్యులతో కలిసి దీపావళి సందర్భంగా టపాసులు కాలుస్తుండగా, ప్రమాదవశాత్తు పేలిన టపాసు తలకు తగలడంతో గాయపడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్సలు అందిస్తున్నారు.

చారిత్రక నిర్ణయం

మదనపల్లె : రాష్ట్రవ్యాప్తంగా పాల ఏకిరి, ఏకిల, వ్యాకుల, ఏకిరి, నాయునివారు, పాలేగారు, తొలగరి, కావలి కులాలను బీసీ–ఏ జాబితాలో గుర్తించడం చారిత్రక నిర్ణయమని పాల ఏకిరి, వైఎస్సార్‌సీపీ నాయకుడు జన్నే శేషాచలపతినాయుడు అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మహానేత వైఎస్.రాజశేఖర్‌రెడ్డి 2008లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాయలసీమలోని పాల ఏకిరి, ఉప కులాలను బీసీ–ఏ జాబితాలోకి చేర్చడం వల్ల ఎన్నో కుటుంబాల్లో వెలుగులు నిండాయని, అయితే సీమేతర ప్రాంతాలవారిని ఉపేక్షించడంపై నిరాశ ఉండేదన్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 10వ తేదీన 21 బీసీ కులాలకు సంబంధించి ప్రాంతీయ అసమానతలను తొలగిస్తూ, రాష్ట్రవ్యాప్తంగా ఒకే రిజర్వేషన్ అమలుచేసేందుకు జీఓ జారీ అయిందన్నారు. ఇందులో పాల ఏకరి, ఉపకులాలను కూడా రాష్ట్రవ్యాప్తంగా బీసీ–ఏగా పరిగణించారన్నారు. కార్యక్రమంలో పాల ఏకరి కార్పొరేషన్ చైర్మన్ ఎం.బి. కుమారరాజా.. మాజీ చైర్మన్, పులిచెర్ల జెడ్పీటీసీ సభ్యులు టి.మురళీధర్‌లు పాల్గొన్నారు.

చౌక బియ్యం పట్టివేత

చింతకొమ్మదిన్నె : కడప–రాయచోటి ప్రధాన రహదారిలోని వైఎస్ఆర్ సర్కిల్ వద్ద అక్రమంగా తరలిస్తున్న ప్రభుత్వ చౌక బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ బి.శ్రీనివాసులురెడ్డి తెలిపారు. పోలీసులు ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టారు. జమ్మలమడుగు ప్రాంతం నుంచి కర్ణాటక రాష్ట్రానికి అక్రమంగా తరలిస్తున్న 400 బస్తాల రేషన్ బస్తాలతోపాటు, లారీని పట్టుకున్నారు. బియ్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

ఆడుకుంటూ.. అనంతలోకాలకు..

- కిందపడి విద్యార్థి మృతి
- తల్లడిల్లిన తల్లిదండ్రులు


ధనుష్ (ఫైల్)

బి.కొత్తకోట : ఆడుకుంటూ వెళ్లిన బిడ్డ.. క్షణాల్లో కళ్ల ముందే మృత్యుఒడి చేరడంతో కుటుంబ సభ్యులు తల్లడిల్లారు. ముక్కుపచ్చలారని పసిబిడ్డ ఏం పాపం చేశాడని తీసుకెళ్లిపోయావు దేవుడా.. అంటూ వారు కన్నీటిపర్యంతమయ్యారు. ఆదివారం రాత్రి జరిగిన ఈ ఘటనకు సంబంధించి స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బి.కొత్తకోట మండలం నాయనబావి పంచాయతీ కంబాలపల్లెకు చెందిన వై.మంజునాథ్, శ్రావణిలకు ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. కుమారుడు ధనుష్ ఏడవ తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు మంజునాథ్, శ్రావణిలు పదేళ్లకుపైగా గ్రామం వదిలి ఉపాధి కోసం బెంగళూరు వలస వెళ్లారు. అక్కడి ఫ్యాక్టరీలలో ఉపాధి పనులు చేసుకొంటూ.. ఇక్కడ పిల్లలను చదివించుకొంటున్నారు. వారు నానమ్మ, తాత వద్దే ఉంటూ చదువుకొంటున్నారు. ధనుష్ బి.కొత్తకోటలో చదువుకొంటుండగా రోజూ వచ్చిపోతుండేవాడు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి ధనుష్ ఇంటిలో వండుతున్న పదార్థాలను కొద్దిగా రుచి చూసి.. వండిపెట్టాలని కొద్దిసేపయ్యాక వచ్చి తింటానంటూ నానమ్మకు చెప్పి బయటకు వచ్చాడు. ఇంటి సమీపంలో ఆడుకొంటూ వెళ్లి రోడ్డుపైనే కుప్పకూలి బోర్లా పడ్డాడు. గమనించిన గ్రామస్తులు లేపి సపర్యలు చేసినా కదలిక లేకపోవడంతో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. ఆడుకొంటూ వెళ్తున్న సమయంలో గుండెపోటు రావడంతో.. ఒక్కసారిగా కుప్పకూలి మృతి చెందినట్టు భావిస్తున్నారు.

దేవుడా.. మాకెందుకీ క్షోభ

రెక్కాడితేకాని డొక్కాడని ధనుష్ తల్లిదండ్రులు మంజునాథ్, శ్రావణీలు దీపావళి పండగకు కూడా స్వగ్రామానికి రాలేని పరిస్థితి. ఆదివారం రాత్రి ధనుష్ చనిపోయిన విషయం తెలుసుకుని రాతికి రాత్రే స్వగ్రామానికి చేరుకున్నారు. విగతజీవిగా పడివున్న బిడ్డను చూసి తల్లిదండ్రుల కన్నీటి పర్యంతమయ్యారు. 'మేము పస్తులుండి మీ భవిష్యత్‌కోసం కష్టపడుతుంటే మాకెందుకీ క్షోభ' అంటూ విలపిస్తుంటే గ్రామస్తులు ఆవేదనకు గురయ్యారు. వీరిని ఓదార్చడం ఎవరివల్ల కాలేదు. పండగవేళ గ్రామమంతా సంతోషంగా ఉండగా ధనుష్ మరణం తీవ్ర విషాదంలో ముంచేసింది.

అవ్వ బదులు పనికి వెళ్లి.. మృత్యు ఒడికి..

- కరెంట్ షాక్ తగిలి మృత్యువాత


మృతి చెందిన శ్రీనివాసులు

రాజంపేట : మున్సిపాలిటీలో అవ్వకు బదులుగా పారిశుధ్య పనులు చేసేందుకు వెళ్లిన మనవడు మరణించిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. పారిశుధ్య కార్మికురాలిగా పని చేస్తున్న గుర్ర నాగమ్మ అనారోగ్యంగా ఉండటంతో.. నిద్రపోతున్న మనవడు శ్రీనివాసులు(16)ను లేపి, తనకు బదులుగా పనికి వెళ్లాలని పంపించింది. నూనివారిపల్లెలో కాంపాక్ట్ వాహనం వద్ద పనులలో భాగంగా ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కరెంటు షాక్ తగిలింది. ఈ సంఘటనలో దుర్మరణం చెందాడు. తన కోసం పనికి వెళ్లిన మనవుడు లేడన్న సమాచారంతో అవ్వ కుప్పకూలిపోయింది. నేను పోయినా బాగుండేది మనవడా అంటూ బోరున విలిపించింది. నా కోసం వెళ్లి చచ్చిపోయా అంటూ రోదించడం పలువురిని కలిచి వేసింది.

మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలి

ప్రాంతీయ వైద్యశాలలో మృతదేహాన్ని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి, చైర్మన్ పోలా సందర్శించి సంబంధీకులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి జెడ్పీ చైర్మన్ ఫోన్ ద్వారా విషయం తెలిపారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. మృతదేహాన్ని సీఐ నరసింహారావు పరిశీలించారు. మృతదేహానికి పోస్టుమార్టం చేసి సంబంధీకులకు అప్పగించారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చిట్వేలి రవి, మున్సిపాలిటీ వర్కర్స్ యూనియన్ నేత ఓబయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజినేయులు, నాయకులు ప్రసాద్, లక్ష్మీదేవి కోరారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి


సుబ్బరాజు (ఫైల్)

కలకడ : బైక్‌ను లారీ ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ సి.టి.స్వామి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కలకడ మండలం కదిరాయచెర్వు వడ్డిపల్లె గ్రామానికి చెందిన పూజారి సుబ్బరాజు (45) తన ద్విచక్రవాహనంతో స్వగ్రామం నుంచి కదిరాయచెర్వు వైపు వెళ్తుండగా.. కదిరాయచెర్వు వైపు నుంచి కలకడ వైపు వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో సుబ్బరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి అన్న నడిపి రెడ్డెప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు మదనపల్లెకు చెందిన లారీ డ్రైవర్ సద్దాం హుస్సేన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సుబ్బరాజుకు భార్య లత, కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో..

వాల్మీకిపురం : అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని తాటిగుంటపల్లిలో సోమవారం చోటు చేసుకొంది. వివరాలు.. చంద్రగిరికి చెందిన లక్ష్మీనారాయణ (40) భార్య బిడ్డలను వదిలేసి వాల్మీకిపురం మండలం తాటిగుంటపల్లి చేగు (కురుకురే) పరిశ్రమలో వంట మనిషిగా పని చేస్తూ ఒంటరి జీవితంతో మద్యంకు అలవాటు పడ్డాడు. నాలుగు రోజుల క్రితం వినాయక స్వామి మాలను ధరించి ఉదయం, రాత్రి ఆలయానికి వెళ్లి వస్తున్నాడు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం లక్ష్మీనారాయణ కాపురం ఉండే గది నుంచి దుర్వాసన వస్తుండడంతో.. ఇరుగుపొరుగు వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు తలుపులను తెరిచి చూడగా అందులో లక్ష్మీనారాయణ శవమై కనిపించారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం అందించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగేశ్వర రావు తెలిపారు.

బాత్‌రూమ్‌లో కింద పడి..


షంషుద్దీన్ (ఫైల్)

బి.కొత్తకోట : భార్య చనిపోయిన రోజే భర్త మృతి చెందిన ఘటన ఆదివారం బి.కొత్తకోటలో జరిగింది. స్థానిక బీసీ కాలనీకి చెందిన ఎస్.షంషుద్దీన్ (55) సీపీఐ సీనియర్ కార్యకర్త. కొన్నేళ్లుగా ఇతను ఓ హోటల్‌లో వంట మాస్టర్‌గా పని చేస్తూ జీవించే వాడు. ఇతనికి ఇద్దరు సంతానం కాగా, వారికి పెళ్లిళ్లు అయ్యాయి. ఇతని భార్య 2021 నవంబర్ 12న మృతి చెందింది. రెండేళ్ల తర్వాత ఇదే తేదీన ఆయన మృత్యువాత పడ్డాడు. ఆదివారం హోటల్‌లో పని చేస్తుండగా.. ముఖం శుభ్రం చేసుకునేందుకు బాత్రూమ్‌లోకి వెళ్లాడు. బయటకు రాకపోవడంతో సిబ్బంది వెళ్లి చూడగా పడిపోయి ఉండటంతో ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు మృతి చెందినట్టు నిర్ధారించారు. సోమవారం సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కృష్ణప్ప, నియోజకవర్గ కార్యదర్శి మనోహర్‌రెడ్డి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, సలీంబాషా, వేణుగోపాల్‌రెడ్డి తదితరులు షంషుద్దీన్ మృతదేహంపై పార్టీ పతాకం ఉంచి నివాళులర్పించారు.

ఎర్రచందనం దుంగల స్వాధీనం

పీలేరు : వాహనంతో సహా రూ. 16 లక్షల విలువైన ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు పీలేరు ఎఫ్ఆర్‌వో వెంకటరమణ తెలిపారు. వివరాలిలా వున్నాయి. ముందస్తుగా అందిన సమాచారం మేరకు.. ఈ నెల 11న పీలేరు – చిత్తూరు రోడ్డు మార్గంలోని అశోక్ నగర్ వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వచ్చిన వాహనాన్ని ఆపేందుకు సిబ్బంది ప్రత్నించారు. అయితే డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా ముందుకు వెళ్లాడు. సిబ్బంది వెంబడించడంతో వాహనాన్ని చీకటిలో ఆపి పరారయ్యారు. అలాగే ఎస్కార్ట్‌గా వచ్చిన మరో వాహనం ఆపి దుండగులు పారిపోయారు. వాహనాన్ని పరిశీలించగా 11 ఎర్రచందనం దుంగలు ఉన్నట్లు గుర్తించారు. రెండు వాహనాలు సహా స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం విలువ సుమారు రూ.16 లక్షలు అవుతుందని తెలిపారు. ఈ దాడిలో అటవీ సిబ్బంది కె. ప్రతాప్, టి. ప్రభుతేజ, ఎ.వెంకటేష్, చరణ్ పాల్గొన్నారు.

కుటుంబ సమస్యలతో ఇద్దరు ఆత్మహత్య


మౌనిక మృతదేహం

మదనపల్లె : కుటుంబ సమస్యలతో వేర్వేరు చోట్ల ఇద్దరు వివాహితలు ఆత్మహత్య చేసుకుని తనువు చాలించారు. మదనపల్లె పట్టణం అయోధ్యనగర్‌కు చెందిన నీలకంఠారెడ్డికి పలమనేరు మండలం కలగటూరుకు చెందిన కేశవరెడ్డి, నిర్మల దంపతుల కుమార్తె ఏ.మౌనిక(28)కు నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు. భార్గవరెడ్డి(3), బన్నీ (11 నెలలు) ఉన్నారు. తన భార్య తన తల్లిదండ్రులను సరిగా పట్టించుకోవడం లేదని.. భర్త మౌనికతో తరచూ గొడవపడే వాడు. ఇటీవల భార్యాభర్తలు గొడవపడి ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. దీపావళి పండుగ సందర్భంగా కేదారేశ్వరవ్రతం ఆచరించేందుకు మదనపల్లెకు వచ్చింది. ఈ క్రమంలో సోమవారం ఉదయం భార్యాభర్తల మధ్య మరోసారి గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన మౌనిక ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను కిందకు దించి ఆస్పత్రికి తరలించేందుకు సిద్ధమవుతుండగా మృతి చెందింది. దీంతో స్థానికులు టూటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ వెంకటేష్ సంఘటనాస్థలానికి చేరుకుని, వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతురాలి తల్లిదండ్రులు ఆస్పత్రి వద్దకు చేరుకుని, బోరున విలపించారు. తమ కుమార్తె మృతికి అల్లుడు, అతడి కుటుంబ సభ్యులే కారణమని ఆరోపిస్తూ మృతురాలి తండ్రి కేశవరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి సీఐ మహబూబ్‌బాషా తెలిపారు.

భర్త తరచూ మద్యం తాగి వచ్చి..


రమాదేవి(ఫైల్)

రామసముద్రం మండలం ఆర్.నడింపల్లె పంచాయతీ ఎగువనల్లప్పగారిపల్లెకు చెందిన వాలీశ్వరతో టి.రమాదేవి(32)కు 8 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ప్రేమ్‌కుమార్(7), భానుప్రియ(3) ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్త తరచూ మద్యం తాగి ఇంటికి వచ్చి భార్యతో గొడవపడుతూ ఉండేవాడు. ఈక్రమంలో మరోసారి మద్యం తాగి ఇంటికి వచ్చి భార్య రమాదేవితో గొడవపడి కొట్టాడు. పండగ పూట భర్త మద్యం తాగి వచ్చి కొట్టడంతో మనస్తాపానికి చెందిన రమాదేవి క్రిమి సంహారిణి మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఐసీయూ విభాగంలో చికిత్స పొందుతూ మృతి చెందింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. రామసముద్రం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.